నాట - ఆది

మర్ద మర్ద - మమబంధాని
దుర్ధాంతమహో - దురితాని

చక్రాయుధ రవి - శత తేజోంచిత
సక్రోధసహ - స్రప్రముఖా
విక్రమక్రమా - విస్ఫులింగ కణ
నక్రహరణ హరి - నవ్యకరాంకా

కలితసుదర్శన - కఠినవిదారణ
కులిశకోటిభవ - ఘోషణా
ప్రళయానగ సం - భ్రమవిభ్రమకర
రళితదైత్యగళ - రక్త వికీరణా

హితకర శ్రీ వేంక - టేశ ప్రయుక్త
సతతపరాక్రమ - జయంకర
చతురోహంతే - శరణం గతోస్మి
యితరాన్ విభజ్య - యిహ మాంరక్ష

హరి సుదర్శనచక్రంపైన చెప్పబడ్డ సంకీర్తనమిది. నూరు సూర్యులతేజంగల చక్రాయుధమా జ్వాలామాలికలతోకూడిన వేయి శ్రేష్టమైన ముఖములుగల చక్రమా ! విక్రమించే క్రమపు సంరంభంలో నిప్పులు వెదజల్లుతూ (గజరాజుని పీడించుతున్న) మొసలిని సంహరించిన చక్రమా ! శ్రీ విష్ణుని నిత్యనూతనమైన కరమందు అమరిన చక్రమా. నా బంధములను నశింపజేయు శమింపరాని నా పాపాలన్నింటినీ నాశనమొనర్చు, సుదర్శనమనే నామం అలరిన చక్రమా! కఠినమైన పర్వతాలను తుత్తు నియలు చేసే కోటి వజ్రాయుధాల తీవ్ర ఘోషతో వెలయుచక్రమా! ప్రళయాగ్ని సంభ్రమమా ఇది అవే విభ్రాంతినొనర్చుతూ తెగనరికిన రాక్షసుల కుత్తుకల నుండి రక్తధారలను వెదజల్లు సుదర్శనమా లొంగిరాని నా అఘములనూ, బంధాలనూ నశింపజేయి. సంహరించు జగద్ధితమొనర్చే శ్రీ వేంకటేశ్వరుచేత ప్రయోగింపబడి నిత్యమైన పరాక్రమం కలిగి, సర్వతోజయముగల చక్రమా! నేను చతురుడనై నీ శరణుజొచ్చాను. నేను హరిభక్తుడను నన్ను రక్షించు. హరి భక్తేతరులను హరించు - సంహరించు. అని సంకీర్తన తాత్పర్యం.

ఈ సంకీర్తనలో సుదర్శనచక్ర మంత్రం నెలకొల్పినారు సంకీర్తనాచార్యులు. సుదర్శ
న కవచంలో సుదర్శనచక్ర మూలమంత్రమూ, లక్ష్మీప్రాప్తి ప్రయోగమంత్రమూ, శత్రునాశ
న ప్రయోగమంత్రమూ, మోహనమంత్రమూ, ఆకర్షణ మంత్రమూ - అయిదు విధాల
మంత్రములు చెప్పబడ్డవి. వైష్ణవంలో విష్ణువు ఆయుధాలైన కౌమోదకి గదకూ, శార్ఙ
ధనువుకూ , నందక ఖడ్గానికి, పాంచజన్య శంఖానికీ, సుదర్శనచక్రానికీ - వేర్వేరు ప్రత్యే
కపూజోపాసనలూ మంత్ర తంత్ర క్రియలూ ఉన్నవి. నిత్యనాధసిద్ధకృతమైన రసరత్నా
కరంలోని మంత్రఖండంలో చక్ర, ఖడ్గ మంత్రాలు ప్రత్యేకంగా చెప్పబడ్డాయి. అహిర్బు
ధ్న్య సంహితలో పార్వతీదేవికీ పరమేశ్వరుడు సుదర్శన సహస్రనామ స్తోత్రం చెప్పినట్లు
ఉన్నది. కూరనారాయణుడనే కవి మయూర సూర్యశతకంతో పోటీగా సుదర్శన శతకం
రచించాడు. అపామార్జన మూల మంత్రంలో పేర్కొనబడ్డ సుదర్శనచక్రమంత్రం ఇది.
ఓం నమో భగవతే శ్రీ సుదర్శనాయ మహా చక్రరాజాయ మాం రక్షరక్ష మమశత్రూన్నాశ
యనాశయ దరదర దారయ దారయచ్ఛింది ఛింది భింది భింది జ్వల జ్వల జ్వాలయ
జ్వాలయ సహస్రకిరణాన్ ప్రజ్వల ప్రజ్వలశిఖా ఉత్త్రేషయోత్త్రేషయ దహనాత్మక చటచట
చాటయ చాటయ గర్జయ గర్జయ త్రాసయ త్రాసయ చూర్ణయ చూర్ణయ వరప్రయు
క్తానాం మంత్రాణా మష్టోత్తరశతం స్ఫోటయ - స్ఫోటయ పరశక్తీః పేషయ పేషయ పర
మంత్రాన్ సంహర సంహర మాంరక్ష సహస్రారహుంఫట్స్వాహా ! ఈ మంత్రాన్నే సరళీ
కరించి ఈ సంకీర్తనలో ప్రతిష్టించారు అన్నమాచార్యులు. తెలుగులో 108 రగడ వృత్తా
లతో సుదర్శన రగడ చెప్పిన అన్నమయ్య గారి సంస్కృత వాక్పటిమయిది.